డివిజన్‌లో 334.8 మి.మీ వర్షపాతం


లక్ష్మయ్య వాగు ఉధృతికి నిలిచిన రాకపోకలు, వాగు వద్ద కాపలా ఉన్న కానిస్టేబుల్ ఉపేంద్ర, వీఆర్వో హరిత

కంచికచర్ల : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో వర్షం నీరు నిలబడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నాలుగు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. నందిగామ డివిజన్‌లో 334.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కంచికచర్లలో 69.0మిల్లీమీటర్లు, నందిగామలో 54.6, చందర్లపాడులో 53.0. వీరులపాడులో 44.6. జగ్గయ్యపేటలో 35.6 పెనుగంచిప్రోలులో 23.4, వత్సవాయిలో 54.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు వివరించారు. కంచికచర్ల మండలంలోని చెవిటికల్లు గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న లక్ష్మయ్య వాగుకు వరద నీరు చేయడంతో ప్రయాణికుల రాకపోకలు నిలిచిపోయాయి. పొంగిపొర్లుతున్న లక్ష్మయ్య వాగు వద్ద పోలీస్‌కానిస్టేబుల్, వీఆర్వోను అధికారులుగా కాపలాగా ఉంచారు. అదేవిధంగా కంచికచర్ల అరుంధతీనగర్‌లో వరదనీరు ఇళ్లలోకి చేరడంతో ఆప్రాంత ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. నీటిద్వారా విషపురుగులు ఇళ్లల్లోకి వస్తున్నాయని ఆందోళనచెందుతున్నారు. ఏటిపట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు కురిసే సమయంలో మట్టి గోడల సమీపంలో..చెట్ల కింద ఉండరాదని అధికారులు సూచిస్తున్నారు. మండలంలోని కీసర మున్నేటికి వచ్చే వరద నీటిని నందిగామ ఆర్డీవో ఏ రవీంద్రరావు పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ నాగుల్ మీరా, వీఆర్వో హసీనాబేగం ఉన్నారు.

తడిసిముద్దయిన జగ్గయ్యపేట ..

జగ్గయ్యపేట అర్బన్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జగ్గయ్యపేట పట్టణంలో నాలుగురోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పట్టణంలో జనజీవనం స్తంభించింది. శనివారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. అనేక వార్డుల్లో డ్రెయిన్లు వరదనీటితో రోడ్లపై పొంగి పొర్లుతున్నాయి. కాగితాలబజార్‌లో డ్రెయిన్‌లు పొంగడంతో మూడు అడుగుల మేర మురుగునీరంతా రోడ్లపైకి చేరింది. దీంతో ప్రజలు తీవ్రఇబ్బందులు పడ్డారు. సత్యనారాయణపురంలో షేర్‌మహ్మద్‌పేటకు వెళ్లే రహదారిలో పొలాల్లోని నీరంతా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న గృహాల్లోకి చేరింది. కోదాడ రోడ్డులోని చికెన్‌సెంటర్, ఎస్‌బీఐ ప్రాంతాల్లో ప్రధాన రహదారిపై నీరు చేరడంతో రాకపోకలకు తీవ్రఅంతరాయం ఏర్పడింది. అయ్యప్పనగర్, పోలీస్‌స్టేషన్, బాలుర హైస్కూల్ రోడ్డుల్లో రోడ్లు పూర్తిగా జలమయమయ్యాయి. వేపలవాగు, చెరువుబజార్, బంగారుపేట తదితర లోతట్టు ప్రాంతాల్లో చేరిన వర్షపు నీరు కారణంగా ఇళ్లల్లోంచి బయటికి రాలేని పరిస్థితి ఏర్పడిందని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తంచేశారు.


కీసర మున్నేటికి వచ్చే వరద నీటిని పరిశీలిస్తున్న నందిగామ ఆర్డీవో రవీంద్రరావు, డీటీ నాగుల్‌మీరా


కంచికచర్ల అరుంధతీనగర్‌లో రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపునీరు


అయ్యప్పనగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు


పేటలోని అమెరికన్ ఆస్పత్రి వద్ద నిలిచిన వర్షపునీరు

ఉధృతంగా ప్రవహిస్తున్న వైరా, కట్టలేరు

- నిలిచిపోయిన రాకపోకలు
- ఇబ్బందుల్లో వీరులపాడు-నందిగామ మండల ప్రజలు

వీరులపాడు: మండలంలోని పల్లెంపల్లి వద్ద వైరా కట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తుంది. నాలుగు రోజులుగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలో భారీ వర్షాలు కురుస్తుండటంతో వైరా కట్టలేరుకు వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో కాజ్‌వేపై నుంచి వర్షపు నీరు పొంగి పొర్లుతోంది. విషయం తెలుసుకున్న నందిగామ ఆర్డీవో రవీంద్రరావు వైరా కట్టలేరు వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉందని భావించి నందిగామ-వీరులపాడు మండలాలకు రాకపోకలు నిలిపివేశారు. దీంతో వైరా కట్టలేరు వద్ద ప్రజలు రాకపోకలు సాగించకుండా వీరులపాడు ఎస్‌ఐ మహాలక్ష్మణుడు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కట్టలేరు వైలెవల్ బ్రిడ్జి వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపడితే రాకపోకలకు ఇబ్బంది లేకుండా రెండు మండలాల ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని ప్రజలు చెబుతున్నారు. ఆదిశగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.


పల్లెంపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కట్టలేరు

లోతట్టు ప్రాంతాలు జలమయం ..

జగ్గయ్యపేట: అల్పపీడన ద్రోణితో జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జగ్గయ్యపేట పట్టణంలోపాటు ఆయా గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాత్రిపగలు తేడా లేకుండా వర్షం కురుస్తుండటంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని చిల్లకల్లు-వైరా రహదారిపై వర్షపు నీరు రెండడుగుల మేర నిల్వటంతో వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. మరో రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖాధికారులు చెబుతుండటంతో పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.


చిల్లకల్లు-వైరా రహదారిపై భారీగా నిలిచిన వర్షపునీరు

క్లుప్తంగా

కౌలు వేలం ద్వారా రూ.1.80 లక్షల ఆదాయం



వేదాద్రి(జగ్గయ్యపేట):యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూముల కౌలు వేలం ద్వారా ఆలయానికి రూ.1.80 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో హేమలతాదేవి తెలిపారు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం గింజుపల్లి గ్రామంలో స్వామి వారికి చెందిన 10.93 ఎకరాలకు భూములకు శనివారం కౌలువేలం నిర్వహించగా, ఈమేరకు ఆదాయం లభించినట్లు ఈవో వివరించారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సబ్సిడీపై కందిపప్పు, బియ్యం



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట రైతుబజారులో సబ్సిడీపై బియ్యం, కందిపప్పు విక్రయించేందుకు ఏర్పాటు చేసిన కౌంటర్ మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, పీడీఎస్ ఇన్‌చార్జి డీటీ శ్రీరామ్మూర్తి రెడ్డి, రైతుబజారు ఈవో రమణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో ధరల నియంత్రణకు పేదలకు కందిపప్పు, బియ్యం అందించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగంగా ఈ కౌంటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కందిపప్పు కేజీ రూ.160, బియ్యం రూ.48, రూ.49 చొప్పున రెండు రకాలు విక్రయిస్తున్నట్లు వివరించారు. ఈ సదుపాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ నూకల బాలకృష్ణ, పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



జగ్గయ్యపేట అర్బన్: వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో పాటు ఇటీవల పట్టణంలో విజృంభించిన డయేరియాతో అప్రమత్తమైన పురపాలక సంఘ అధికారులు, సిబ్బంది ముమ్మర పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ సర్వే నిర్వహిస్తూ, సీజనల్‌వ్యాధుల బారిన పడకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మున్సిపల్ శానిటరీ విభాగం ఆధ్వర్యంలో ప్రధాన డ్రెయిన్లలో వ్యర్థాలను తొలగిస్తూ మురుగునీటి పారుదల సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటున్నారు. వార్డుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నారు. పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, సచివాలయాల శానిటరీ, హెల్త్ సెక్రటరీలు పర్యవేక్షిస్తున్నారు

గురువుకు అధిక ప్రాధాన్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యధిక ప్రాధాన్యముందని కూరపాటి హైస్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య అన్నారు. కూరపాటి హైస్కూల్ ఆవరణలో గురుపౌర్ణమి వేడుకలను శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత యుగంధరాచార్య వ్యాసభగవానుని చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు జన్మనిస్తే గురువు మనకు ఉజ్వల భవిష్యత్తును ఇస్తాడని చెప్పారు. ఆషాఢ పౌర్ణమి వ్యాసభగవానుడు పుట్టిన రోజు అని, దానినే వ్యాస పూర్ణిమ అని గురు పూర్ణిమ అంటారని వివరించారు.

అమ్మవారికి మక్కపేట సారె సమర్పణ


ఆషాడం సారెను తీసుకుని మక్కపేట నుంచి పెనుగంచిప్రోలుకు బయలుదేరిన మహిళలు


తిరుపతమ్మవారికి మక్కపేట నుంచి సారె తెచ్చిన భక్తులు

పెనుగంచిప్రోలు: ఆషాడమాసం సందర్భంగా పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మవారికి శనివారం వత్సవాయి మండలంలో మక్కపేట గ్రామం నుంచి పెద్దసంఖ్యలో మహిళలు సారె సమర్పించి బోనాలు చెల్లించారు. సారెతో ఆలయానికి చేరకున్న మహిళలకు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. మక్కపేట మహిళలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో తిరుమలగిరి వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కొమరగిరి రవీంద్ర భరద్వాజ్ దంపతులు, ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మక్కపేటలో సారె ఊరేగింపు..

మక్కపేట(వత్సవాయి) : శ్రీగోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారికి ఆషాఢం సారె సమర్పణ నేపథ్యంలో మక్కపేటలో మహిళలు భారీ ఊరేగింపు నిర్వహించారు. తొలుత గ్రామంలోని శ్రీకోదండ రామాలయం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డప్పు వాయిద్యాలతో సారెను గ్రామంలో ఊరేగించారు. గ్రామ ప్రధానసెంటర్‌లో ఉన్న బొడ్రాయికి పూజలు చేసిన అనంతరం ప్రత్యేక వాహనాలలో పెనుగంచిప్రోలు అమ్మవారికి ఆలయానికి తరలివెళ్లారు. తిరుమలగిరి వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కొమరగిరి రవీంద్రభరద్వాజ్, కొండబోలు నాగేశ్వరరావు, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.


సారె సమర్పించి పూజల్లో పాల్గొన్న భక్తులు


ఆలయంలో అమ్మవారికి సారె సమర్పిస్తున్న మక్కపేట గ్రామస్తులు

బోరుకు విద్యుత్ మోటార్ ఏర్పాటు

సర్పంచి బొక్కా రవికుమార్

కంచికచర్ల : మండలంలోని గండేపల్లిలో తాగునీటి ఎద్దడి లేకుండా రోజూ గ్రామంలోని అన్ని వీధులకు తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టినట్లు సర్పంచి బొక్కా రవికుమార్ తెలిపారు. మండలంలోని గండేపల్లి రక్షిత మంచినీటి పథకానికి సంబంధించి కీసర మున్నేటిపై ఏర్పాటు చేసిన బోరుపంపు మరమ్మతులకు గురికావడంతో పంచాయతీ నిధులు రూ.85వేలతో నూతన విద్యుత్ మోటార్‌ను శనివారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామంలో ఏళ్ల తరబడి తాగునీరు సరఫరా కాని ఇళ్లను గుర్తించి, వారందరికీ ప్రతిరోజూ నీటిని సరఫరా చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. గ్రామంలో నీటికొరత లేకుండా అవసరమైన అన్నిచర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జె.రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.


నూతన విద్యుత్‌మోటార్ ఏర్పాటు పనులను పర్యవేక్షిస్తున్న

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

ఇన్‌చార్జి ఎంపీపీ హనుమంతరావు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీపీ ఆకుల హనుమంతరావు

నందిగామటౌన్: వర్షాలు పడుతుండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని నందిగామ ఇన్‌చార్జి ఎంపీపీ ఆకుల హనుమంతరావు(రంగా) సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీపీ అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతోపాటు పారిశుద్ధ్యం ప్రాధాన్యంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో జ్వరపీడితులను గుర్తించి చికిత్స అందించడంతోపాటు ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

సమావేశం దృష్టికి పలు సమస్యలు...

సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ మండలంలోని పలుసమస్యల ఏకరువు పెట్టారు. జొన్నలగడ్డలో బోరు పంపులకు మరమ్మతులు చేయించాలని, గత సమావేశంలో తెలిపినా నేటికీ పరిష్కారం కాలేదని సర్పంచి లగడపాటి పుష్పరేణి గుర్తుచేశారు. పల్లగిరిలో పగలు కూడా వీధిలైట్లు వెలుగుతున్నాయని పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. ముఖ్యంగా గ్రామంలో జలజీవన్ మిషన్ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని పనులను వెంటనే పూర్తి చేయాలని సర్పంచి రవికిరణ్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వేల్పుల రాములు కోరారు. మాగల్లులో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని కనీసం మరమ్మతులు కూడా చేపట్టడం లేదని ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మినేని శోభారాణి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా నందిగామ మున్సిపాలిటీలో సేకరించిన చెత్తాచెదారాన్ని మునేటి ఒడ్డున డంప్ చేస్తుండటంతో మంచినీరు కలుషితమవుతున్నాయని, మునేటి ఒడ్డున డంప్ చేయకుండా చూడాలని కోరారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు సైతం సమస్యలను విన్నవించారు.

అందుబాటులో అన్నిరకాల మందులు..

నందిగామలోని ప్రభుత్వాస్పత్రితోపాటు లింగాలపాడు, గోళ్లమూడి గ్రామాల్లోని పీహెచ్‌సీలలో అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారి రవికుమార్ తెలిపారు. అన్ని వ్యాధులకు సంబంధించి 64రకాల పరీక్షలు చేసేందుకు కూడా సిబ్బంది సిద్ధంగా ఉన్నారని చెప్పారు. వ్యవసాయశాఖాధికారి ఖాశీం మాట్లాడుతూ మండలంలో 1870హెక్టార్లలో పత్తి, 441హెక్టార్లలో మొక్కజొన్న సాగుతోపాటు 28 హెక్టార్లలో నారుమడులను రైతులు సిద్ధం చేశారని చెప్పారు. కురుస్తున్న వర్షాలకు పంటలకు ఇప్పటివరకు ఎటువంటి నష్టం వాటిల్లలేదని వివరించారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పిచ్చయ్య. ఎంపీడీవో విశ్వనాథ్, తహసీల్దార్ సరస్వతి, ఈవోపీఆర్డీ పద్మజ్యోతి, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పవిత్రోత్సవాలు

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలను శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారికి పవిత్ర శుద్ధ, అగ్ని స్థాపన, నవగ్రహయజ్ఞం, పంచసేనాదివాసం, ప్రధాన హోమాలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈవో హేమలతాదేవి, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్ పాల్గొన్నారు.

24న హుండీ లెక్కింపు..

యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి హుండీని ఈనెల 24వతేదీ ఉదయం పదిగంటలకు లెక్కిస్తున్నట్లు ఈవో హేమలతాదేవి తెలిపారు.

25 వరకు హిందీ పరీక్షల దరఖాస్తులకు అవకాశం

తిరువూరు: దక్షిణ భారత హిందీ ప్రచార సభ వార్షిక పరీక్షలకు దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 25వ తేదీతో ముగుస్తుందని ప్రచారక్ రేపాక రఘునందన్ తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబరు 14, 15 తేదీల్లో జరుగనున్న హిందీ వార్షిక పరీక్షలకు దరఖాస్తు రుసుం చెల్లింపునకు ఈ నెల 25వరకు గడువు విధించిన ప్రచార సభ మరో ఐదు రోజుల పాటు అపరాధ రుసుంతో అవకాశం కల్పించిందని చెప్పారు. వివరాలకు సెల్: 94408 48924లో సంప్రదించాలని సూచించారు.

మండలాభివృద్ధిపై సమీక్ష


మాట్లాడుతున్న జగ్గయ్యపేట మండల ప్రత్యేకాధికారి మహేశ్వరరావు

చిల్లకల్లు(జగ్గయ్యపేట):గ్రామాల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సహకరించాలని మండల ప్రత్యేకాధికారి మహేశ్వరరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్నిశాఖల అధికారులతో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాలోల అభివృద్ధికి తీసుకోవాల్సిన సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలని ఆయాశాఖల అధికారులకు సూచించారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీ అధికారులు సర్పంచ్‌లతో సమీక్షించి గ్రామాభివృద్ధికి సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకం, గ్రామాల్లో ఉపాధి హామీ పనులు, పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్ పనులపై నిరంతరం సమీక్షలు చేస్తామన్నారు. ఆయా శాఖల అధికారులు అలసత్వంవహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశానికి ఎస్‌ఎస్పీ, అటవీ శాఖాధికారులు రాకపోవడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, తహసీల్దార్ శేషగిరి, ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీభార్గవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

ప్రకటన

[illegible]

గుమ్మడిదుర్రు తాగునీటిలో కనుము

పరిశీలించిన డీఎంహెచ్‌ఓ సుహాసిని

గుమ్మడిదుర్రు(పెనుగంచిప్రోలు):గ్రామంలోని ప్రజలకు సరఫరా చేసే నీరు కనుముగా వస్తుండటంతో గ్రామస్తులు ఇబ్బందిపడుతున్నారు. గ్రామ తాగునీటి అవసరాల కోసం మునేరులో వేసిన బోరు నుంచి గ్రామంలోని ఓవర్‌హెడ్‌ట్యాంక్‌కు నీటిని ఎక్కిస్తారు. అక్కడి నుంచి పైపులైన్ ద్వారా గ్రామప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. 35ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన బోరు నుంచి వచ్చే నీటిలో కనుము ఉంటూ నీటితోపాటు ఎర్రటి బురద కూడా వస్తుండటంతో ఈ నీటిని వినియోగించేందుకు గ్రామస్తులు అవస్థలుపడుతున్నారు. గ్రామంలో డయేరియా ప్రబలుతున్న నేపథ్యంలో ఈనీటి వ్యవహారాన్ని గ్రామస్తులు అధికారుల దృష్టికి తెచ్చారు. ఎర్రగా వస్తున్న నీటిని డీఎంహెచ్‌ఓ సుహాసిని పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈ నీటిలో దోమ లార్వా ఏమీ లేదన్నారు. నీటిని శాంపిల్స్ తీసుకుని ల్యాబ్‌కు పంపించాలని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్, వైద్య సిబ్బందికి సూచించారు. తాగునీరు ఎర్రగా వస్తున్న విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరసింహారావుతో మాట్లాడారు. సమస్యపై సంబంధింత అధికారులతో మాట్లాడాలని కోరారు. గ్రామానికి చెందిన ఓ కుటుంబం నుంచి ముగ్గురు వ్యక్తులు డయేరియాతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న నేపథ్యంలో వారి ఇంటిని డీఎంహెచ్‌వో పరిశీలించారు. డయేరియా బాధితుల ఇంటి పరిసరాల్లో పేడదిబ్బ ఉండటాన్ని గుర్తించి, వెంటనే తొలగించాలని సూచించారు. గ్రామస్తులంతా పరిసరాల పరిశుభ్రత పాటించాలని డీఎంహెచ్‌వో కోరారు.


కనుముగా ఉన్న నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ సుహాసిని


కనుము నీటిపై తహసీల్దార్ అమ్మాజీ, ఎంపీడీవో సాయిహర్షతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

తిరుపతమ్మ గుడి కొండపై కూలిన ప్రహరీ


కూలిన ప్రహరీ గోడ

భవానీపురం(విజయవాడపశ్చిమ): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి 45వ డివిజన్ పరిధిలోని కబేళా సెంటర్‌లో గల తిరుపతమ్మ గుడి కొండపై ఒక ఇంటి ప్రహరీ కూలి పక్కంటిపై పడింది. ఘటన శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరగటంతో ఆస్తి నష్టం మినహా ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతమ్మ గుడి కొండపైన వల్లభాపురం కోటేశ్వరరావు, ఆయన సోదరుడు కగావ్ నివసిస్తున్నారు. నానుడు వర్షం కారణంగా శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 2.30 గంటల సమయంలో కగావ్ ఇంటి ప్రహరీ గోడ కూలి పక్కనే ఉన్న కోటేశ్వరరావు ఇంటిపై పడింది. దీంతో ఆయన ఇల్లు పూర్తిగా దెబ్బతింది. విషయం తెలిసిన సీపీఐ నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు కమిటీ సభ్యులతో కలిసి శనివారం కొండ ప్రాంతంలో పర్యటించి పాక్షికంగా, పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి బాధితులను పరామర్శించారు.